క్లుప్తంగా

పేదరికాన్ని అధిగమించి.. ఎస్‌ఐ ఉద్యోగం సాధించి



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ తదితరులు

పహాడీషరీఫ్: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన యువకుడు సివిల్ ఎస్సైగా ఉద్యోగం సాధించాడు. బాల్యం నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన మల్లెమోని శ్రీకాంత్ యువతకు ఆదర్శంగా నిలిచాడు. ఎస్సైగా ఉద్యోగం సాధించిన శ్రీకాంత్‌ను కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ సోమవారం శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు. 2018లో తండ్రి చనిపోయినప్పటికీ.శంషాబాద్ విమానాశ్రయంలో దినసరి కూలీగా పని చేస్తున్న తన తల్లి ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించానని తెలిపాడు. శ్రీకాంత్ చిన్న అక్క ఇప్పటికే పోలీస్ కానిస్టేబుల్‌గా కొనసాగుతోంది. సివిల్ సర్వీస్‌లో జాబ్ కొట్టడమే తన లక్ష్యమని శ్రీకాంత్ సాక్షితో పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ సవూద్ అవల్గీ

పహాడీషరీఫ్: మంత్రి సబిత ఇంద్రారెడ్డి ప్రత్యేక కృషితో జల్‌పల్లి మున్సిపాలిటీకి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని 22వ వార్డు కౌన్సిలర్ సవూద్ అవల్గీ అన్నారు. రూ.80 లక్షల వ్యయంతో వార్డులో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గం యువజన విభాగం ఉపాధ్యక్షుడు మహ్మద్ పర్వేజ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి సబితా ఇంద్రారెడ్డి జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కోట్లాది వెచ్చించారన్నారు.

బాచుపల్లిలో యూత్ కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: మండలంలోని బాచుపల్లిలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దంతోజి నరసింహచారి ఆధ్వర్యంలో సోమవారం యూత్ డిక్లరేషన్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యువత అభివృద్ధి చెందేలా ఎలాంటి పథకాలు అమలు చేయనుందో అవగాహన కల్పించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, నవీన్‌గౌడ్, కృష్ణకుమార్, రాఘవేందర్, ముత్యాలు, ఇస్తారి, యాదయ్య, విజయ్, రామకృష్ణ, రాజు, ఎండీ సయ్యద్‌బాబా, బి.మల్లేష్, ఊటు రాజు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రాళ్ల తరలింపు



ఔటర్ రోడ్డుపై రాళ్లను తరలిస్తున్న టిప్పర్లు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఈ-సిటీ నుంచి టిప్పర్ వాహనంలో బండరాళ్లను గత కొద్ది రోజుల నుంచి నేహా ఔటర్ రింగు సర్వీస్ రోడ్డులో ఆదిబట్ల వైపు తరలిస్తున్నారు. టిప్పర్ వాహనంలో పెద్ద, పెద్ద బండరాళ్లను పరిమితికి మించి రవాణా చేయడంతో పాటు, వాహనానికి వెనుక భాగంలో డోరు లేకుండా రవాణా చేస్తున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం చేసే వాహనదారులు కనీసం రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు భయపడుతున్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ తెలిపారు. 11వ వార్డులోని ఆదర్శనగర్ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, కౌన్సిలర్ యాదమ్మలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంపాల్‌నాయక్, కౌన్సిలర్ యాదమ్మలు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు హరిప్రసాద్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



మొదలైన రోడ్డు విస్తరణ పనులు



రోడ్డు విస్తరణలో తొలగించిన చెట్లను ఇతర ప్రాంతంలో నాటిన దృశ్యం

శరవేగంగా విమానాశ్రయ పనులు

పహాడీషరీఫ్: శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మామిడిపల్లి కూడలి వరకు తలపెట్టిన ఉత్తర ద్వారం నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ సమీపంలోని నాగలక్ష్మమ్మ కంచె నుంచి 2.5 కిలోమీటర్ల మేర 150 ఫీట్ల విస్తీర్ణంలో కొత్తరోడ్డు నిర్మాణ పనులు ఐదు నెలల క్రితమే ప్రారంభమవ్వగా.. సీఐఎస్ఎఫ్ నుంచి మామిడిపల్లి కూడలి వరకు ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి. మొత్తం రూ.29.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులకు సంబంధించి రోడ్డుకిరువైపులా ఉన్న భారీ వృక్షాలను తొలగించి.. ఇతర ప్రాంతాలలో పాతారు.

మారనున్న రూపురేఖలు

ఈ కొత్త రహదారిలో రెండు భారీ జంక్షన్లను కూడా నిర్మిస్తున్నారు. ఈ రోడ్డును ఆనుకునే ఢిల్లీ పబ్లిక్ స్కూల్(ఏరో సిటీ బ్రాంచ్) కూడా నిర్మించి ఈ ఏడాదే విద్యాబోధన ప్రారంభమైంది. త్వరలో ఈ రహదారి పూర్తి కానుండడంతో 16 ఏళ్ల అనంతరం కార్గో రోడ్డు ఉద్దేశం నెరవేరనుంది. విమానాశ్రయానికి గూడ్స్ సామగ్రితో వెళ్లే భారీ వాహనాలు, సాధారణ ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యలు లేకుండా సులభంగా చేరుకోవాలనే ఉద్దేశంతో 2007వ సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పి–7 కార్గో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. 100 ఫీట్ల విస్తీర్ణంలో ఒరంగడ్డ నుంచి ప్రారంభమైన ఈ రహదారి లక్ష్మీగూడ, వాంబే కాలనీ, శ్రీరాం కాలనీ, జల్‌పల్లి మీదుగా మామిడిపల్లి వివేకానంద చౌరస్తా వరకు ఆరు కిలోమీటర్ల మేర పనులు అప్పట్లోనే పూర్తయ్యాయి. విమానాశ్రయానికి అనుసంధానం చేయని కారణంగా ఇన్నాళ్లపాటు కేవలం తుక్కుగూడ, శంషాబాద్ రూట్‌లోనే ఈ కార్గో వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉంటూ వచ్చింది. ఎట్టకేలకు ప్రస్తుతం పూర్తి అవుతుండడంతో ఈ రోడ్డు నిర్మాణ ఉద్దేశం నెరవేరనుంది.

మెట్రో రైలు సైతం

కందుకూర్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం మీదుగా మామిడిపల్లి, జల్‌పల్లి మీదుగా నూతనంగా మెట్రో లైన్ నిర్మించనున్నట్లు ఇటీవలే మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఇప్పటికే పెద్ద ఎత్తున విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ నివాసాలు, అపార్ట్‌మెంట్లు నిర్మాణాలు ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఈ రహదారి పనులు పూర్తి కావడంతో పాటు మెట్రో రైలు సదుపాయం ఏర్పడితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధికి నోచుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

మహేశ్వరం అభివృద్ధికి నిధుల వెల్లువ

- రూ.160 కోట్ల 90 లక్షల నిధులు మంజూరు
- సీఎం కేసీఆర్‌కి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: నియోజకవర్గం అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.160 కోట్ల నిధులను మంజూరు చేశారని సోమవారం విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బండంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు రూ.50 కోట్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలకు రూ.25 కోట్లు, మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని 66 గ్రామ పంచాయతీలకు ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.15 లక్షల చొప్పున రూ.9 కోట్ల 90 లక్షల నిధులు విడుదల అయ్యాయని ఆమె తెలిపారు. మహేశ్వరం మండలంలోని తుమ్మలూరులో దశాబ్ది కమ్యూనిటీ నిర్మాణానికి రూ. కోటి రూపాయాలు మంజూరయ్యాయి. ఇప్పటికే తుమ్మలూరు మ్యాక్ ప్రాజెక్టు సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. భారీగా నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. గతానికి భిన్నంగా అభివృద్ధి పనులకు నేడు బాటలు పడుతున్నాయన్నారు. ఒక ప్రభుత్వం వాగ్దానం చేస్తే మరొక ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఆ తర్వాతి ప్రభుత్వాలు శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు జరిగేవి. నేడు వాటికి భిన్నంగా స్వరాష్ట్రంలో అభివృద్ధి కొంతపుంతలు తొక్కుతుంది. మహేశ్వరం నియోజకవర్గంలో తుమ్మలూరులో ఇటీవలే సీఎం కేసీఆర్ పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీలు శరవేగంగా అమలు జరుగుతున్నాయి. తుమ్మలూరు సబ్‌స్టేషన్ నిర్మాణానికి 24 గంటల్లో కార్యరూపం దాల్చగా , తాజాగా వివిధ అభివృద్ధి పనులకు రూ.160 కోట్ల 90 లక్షల నిధులు విడుదల అయ్యాయి.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 19 మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమ వారం సీఐ మాట్లాడుతూ ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఎస్సీ–01, గీతకార్మికులకు–03, ఇతరకులకు–15 కేటాయించామని తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు బండ్లగూడ జాగీర్‌లోని రాష్ట్ర ఎక్సైజ్ అకాడమీ వద్ద, నాంపల్లి అబ్కారీ కార్యాలయంలోని 4వ అంతస్తులో, సరూర్‌నగర్ అబ్కారి అధికారి కార్యాలయం నందు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. రూ.2 లక్షలు చలాన్, డీడీ జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి సరూర్‌నగర్ రంగారెడ్డి జిల్లా పేరు మీద తీయాలని సూచించారు.

కళ్ల కలకపై అవగాహన సదస్సు



చుక్కల మందులు వేస్తున్న వైద్య సిబ్బంది

మహేశ్వరం: మండలంలోని మహేశ్వరం గేటు వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ హాస్టల్‌లోని విద్యార్థులకు కళ్ల కలక రావడంతో వైద్యులు, సిబ్బంది సోమవారం విద్యార్థులను పరిశీలించి చుక్కల మందు వేశారు. మండలంలో కండ్ల కలక వ్యాధి తీవ్రంగా వ్యాపించడంతో వైద్యుల కళ్లకలక వచ్చిన వారు యాంటీబయెటిక్ ఐడ్రాప్స్, టూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్ వేసుకోవాలని వైద్యులు సూచించారు. చేతులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళ్లను నలవకూడదన్నారు. గొరువెచ్చటి నీటితో ముఖాన్ని శుభ్రంగా కడుక్కోవాలని వారు సూచించారు.కళ్లకు కూలింగ్ గ్లాసులు వాడాలి. అంతకు ముందు విద్యార్థులకు కండ్లకళ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్లు నర్సింహ చారి, నర్సింహ స్వామి, జలీల్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తు సర్వీస్‌లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం భోజన విరామ సమయంలో సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి రెగ్యులర్ చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్న విధంగా కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన వేతనం, ఆరోగ్య భద్రత, ఉద్యోగభద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా నాలుగు రోజులుగా నిరసన చేస్తున్నామని తెలిపారు. సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 250మంది ఏఎన్ఎం, ఫార్మాసిస్ట్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ , సపోర్టింగ్ స్టాఫ్ పని చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో శశికళ, విజయ, బాలరెడ్డి, లోకేష్, సతీష్, స్రవంతి, శిరీష, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి

చైర్మన్ కె మధుమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మధుమోహన్

తుక్కుగూడ: మున్సిపాలిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఆయన అధ్యక్షతన కౌన్సిల్ సాధరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న 15 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.4 కోట్ల 42 లక్షల నిధులను కేటాయించమన్నారు. ఈ నిధులు నుండి సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలకు పెన్సింగ్ ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, మంచినీటి వసతి కల్పన, వీధి దీపాలు, వాహనాల కొనుగోలు, పారిశుధ్య పనుల నిర్వహణ తదితర పనులను చేపడుతమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, అనిత, శివకుమార్, మౌనిక, పద్మ, తేజస్విని, విలాస్, హేమలత, రవి నాయక్, సుమన్, భావన, లావణ్య, ఏఈఈ కె.భార్గవ్‌రెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్, వివిధ శాఖల సిబ్బంది, పాల్గొన్నారు.

భూమి దక్కేవరకు అండగా ఉంటాం

బీజేపీ నాయకుడు శ్రీరాములుయాదవ్



బాధితులను పరామర్శిస్తున్న అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: దావుత్‌ఖాన్‌గూడ సర్వేనంబర్–2లోని దళితుల భూమి అంగుళం కబ్జా కాకుండా చూసి సాగులో ఉన్న భూనిర్వాసితులకు చెందే వరకు అండగా ఉంటామని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. సోమవారం 'మాభూమి మాగ్గావాలే' దళితులు చేస్తున్న రిలే దీక్షలకు అందెల శ్రీరాములు సంఘీభావం తెలిపారు. వంటావార్పు చేస్తున్న భూనిర్వాసితులతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. బడంగ్‌పేట దళితుల భూములపై ఈటల అసెంబ్లీలో మాట్లాడుతుంటే మైక్ కట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పేదల భూములను కబ్జా చేసే పనిలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో దళితుల భూములు ఎక్కడ ఉన్నాయో అక్కడ బీఆర్ఎస్ నాయకులు వాలిపోతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీజేపీ దళిత నేతలు ఇంద్రసేనా, నాగార్జున, చిత్రం శ్రీనివాస్, కార్పొరేటర్లు శ్రీధర్‌రెడ్డి, రమాదేవి, నిమ్మల సునిత, మాధురి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, ముత్తయ్య, ముత్యాలు లక్ష్మమ్మ, ధన్‌రాజ్ తదితరులున్నారు.

ఏఎన్ఎంల ముందస్తు అరెస్ట్

ఇబ్రహీంపట్నం రూరల్: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కలవడానికి వెళ్తున్నారనే సమాచారంతో ఏఎన్ఎంలను ఆదిబట్ల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ గురువారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట ఏఎన్ఎంలు నిరసన తెలిపారు. 16 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తుంటే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం దారుణమన్నారు.

అరెస్ట్ అప్రజాస్వామికం

తుర్కయంజాల్: ఏఎన్ఎంల అరెస్ట్ అప్రజాస్వామికమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య విమర్శించారు. కొన్నేళ్లుగా రెగ్యూలరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇవ్వాలని ప్రయత్నించిన ఏఎన్ఎంల అరెస్ట్ చేయడం చట్ట విరుద్ధమన్నారు.

తల్లిపాలు బిడ్డకు మేలు

మహేశ్వరం ఐసీడీఎస్ సీడీపీఓ షభానా



మహేశ్వరం: కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ షభానా



బాచుపల్లి అంగన్‌వాడీలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ తదితరులు

మహేశ్వరం: తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరం లాంటివని మహేశ్వరం ఐసీడీఎస్ సీడీపీఓ షభానా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పొరండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. ముర్రుపాలు తాగడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఎలాంటి రోగాలు రావన్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం గర్భిణులు, పిల్లలు, బాలింతలు తప్పనిసరిగ్గా తీసుకోవాలన్నారు. తల్లి రోజు గ్రుడ్లు, పాలు, ఆకుకూరలు, రొట్టెలు తినాలన్నారు. కార్యక్రమంలో కోళ్లపడకల్ ఎంపీటీసీ హన్మగళ్ల చంద్రయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ , అంగన్‌వాడీ టీచర్, పలువురు తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లి పాలు అమృతంలాంటివి

కందుకూరు: తల్లిపాలు అమృతంలాంటివని, పుట్టిన వెంటనే బిడ్డకు తప్పకుండా తల్లిపాలు తాగించాలని రాచులూరు, బాచుపల్లి సర్పంచులు శ్రీనివాసాచారి, శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని రాచులూరు, బాచుపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆహారం తినిపించడం ప్రారంభించినా కూడా రెండేళ్ల వరకు తమ పిల్లలకు తల్లి పాలు అవసరం ఉంటుందన్నారు. తల్లి పాలు ఓ ఔషదంలా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగ, యాదమ్మ, సుమలత, హెచ్ఎంలు యాదమ్మ, రామకృష్ణారెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతిలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

మీర్‌పేట్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ నాదర్‌గుల్ సూపర్‌వైజర్ కుమారి పేర్కొన్నారు. సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ ఫేజ్–2 ఎం లెనిన్‌నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... బిడ్డ పుట్టగానే తల్లిపాలను పట్టించాలన్నారు. తల్లి, శిశువుల ఆరోగ్యం దృష్ట్యా 6 నెలల పాటు తల్లిపాలను తప్పనిసరిగ్గా ఇవ్వాలని సూచించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యత, పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లలిత, రాజేశ్వరి బాలింతలు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయండి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. సోమవారం భీమానగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాలనీ ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ సుజాతనాయక్ పరిశీలించారు. కార్పొరేటర్ సుజాతానాయక్ మాట్లాడుతూ... భీమానగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరగా పూర్తికావడమే కాకుండా ఆ పనులలో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కోటి 9 లక్షల రూపాయలతో కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులను పూర్తిచేస్తే కాలనీలో సమస్యలన్నీ తొలగిపోతాయని, కాలనీలో పార్కు ప్రహరీకి రూ. 14 లక్షలు మంజూరు చేయించామన్నారు. అతిత్వరలోనే పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ సుజాతనాయక్ తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, భీమానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, ఉపాధ్యక్షులు నర్సింహ్మారెడ్డి, రఘురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

ఆమనగల్లు తహసీల్దార్‌గా లలిత

ఆమనగల్లు: ఆమనగల్లు మండల తహసీల్దార్‌గా సోమవారం సీహెచ్ లలిత బాధ్యతలు చేపట్టారు. ఆమనగల్లు తహసీల్దార్‌గా పనిచేసిన జ్యోతి హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీ సెక్షన్‌లో పనిచేస్తున్న గిరిజను ఆమనగల్లు తహసీల్దార్‌గా నియమించిన విషయం తెలిసిందే. అయితే ఆమనగల్లు రావడానికి గిరిజ విముఖత చూపడంతో లలితను ఆమనగల్లుకు బదిలీచేశారు.

డాక్టర్ అబ్బయ్యకు సన్మానం

ఇబ్రహీంపట్నం: గాంధీ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై వెళ్లిన డాక్టర్ అబ్బయ్యను రాష్ట్ర డయాగ్నోస్టిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుడిగా అబ్బయ్య ఎంతో మందికి వైద్య సేవలను అందించారన్నారు. ఆయన గాంధీ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు తీసుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని, సుందరంగా తీర్చిదిద్ది సందర్శకులను ఆకట్టుకునేలా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్–3 కాలనీవాసులు కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కాలనీలో పార్కు అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సాయినికేతన్, వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భరత్‌లాల్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, సభ్యులు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



మందులను అందజేస్తున్న వైద్యులు

పహాడీషరీఫ్: బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో భారత గ్రామ నవ నిర్మాణ స్వచ్ఛంద సేవా సంస్థ (మారీ) సహకారంతో జల్‌పల్లి మున్సిపాలిటీలోని రాయల్‌కాలనీలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ సమీరా ఈ శిబిరంలో కళ్లకలకకు సంబంధించి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి డ్రాప్స్, మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సమీరా మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, హెచ్ఈఓ వినోద్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ మనీ సురేష్, ఆరోగ్య కార్యకర్తలు సైదులు, ఉష, ఆశకార్యకర్తలు లీలావతి, స్రవంతి, మారీ సంస్థ ఆర్గనైజర్ సిల్వేరీ సాంబశివ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట: గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న మేయర్ పారిజాత, తదితరులు

గద్దర్‌కు అశ్రునివాళి

ప్రజాయుద్ధనౌక గద్దర్ మృతితో మహేశ్వరం నియోజకవర్గంలోని పలువురు నాయకులు, ప్రజలు సోమవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలు మరులేనివని అన్నారు. ఆట, పాటలతో ప్రజలను చైతన్యం చేశారని కొనియాడారు.



కందుకూరు: నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి



కందుకూరు చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు